
తాగునీటి కోసం ఫిర్యాదు చేసేందుకు ప్రజాభవన్‌కు వచ్చిన రాజ్‌నగర్‌వాసులు

తాగునీరు రావట్లేదు మహాప్రభో..

● ప్రజాభవన్‌లో ఖాళీ బిందెలతో వచ్చి ఫిర్యాదు

ఖైరతాబాద్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): నగర నడిబొడ్డున ఉన్న ఖైరతాబాద్ రాజ్‌నగర్‌లో తాగునీరు సరఫరా కావడం లేదని స్థానికులు ఖాళీ బిందెలతో ప్రజాభవన్ వద్ద ప్రదర్శన నిర్వహించి ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. మంగళవారం రాజ్‌నగర్‌కు చెందిన మహిళలు ఖాళీ బిందెలతో ప్రజాభవన్‌కు చేరుకున్నారు. అక్కడ ఉన్న మీడియా ప్రతినిధులకు తమ తాగునీటి గోడు వినిపించారు. ఈ సందర్భంగా రాజ్‌నగర్ ప్రతినిధి శ్రీనివాస్ మాట్లాడుతూ.. రాజ్‌నగర్‌లో దాదాపు 3 నెలల నుంచి తాగునీటి సరఫరా సరిగ్గా లేదన్నారు. మొదట కలుషిత నీరు సరఫరా అయ్యేవి. కొద్ది రోజుల తర్వాత లో ప్రెషర్ సమస్య మొదలయిందన్నారు. ఆ తర్వాత తాగునీటి సరఫరా ఆగిపోతోందని వాపోయారు. ఈ విషయమై జలమండలి అధికారులకు, ప్రజా ప్రతినిధులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా జలమండలి అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రాజ్‌నగర్‌లో ప్రస్తుతం ఉన్న నీటి పైప్‌లైన్‌ను మార్చి 4 ఇంచులతో కొత్త పైప్‌లైన్ వేయాలని కోరారు.


నల్గొండ సభకు తరలిన బీఆర్ఎస్ శ్రేణులు

ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే ఊరుకోం: దానం

బంజారాహిల్స్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రజలకు ఇబ్బంది కలిగించేలా పని చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నల్గొండ సభకు ఆయన బంజారాహిల్స్ నుంచి ర్యాలీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా కార్యకర్తలనుద్దేశించి మాట్లాడుతూ.. వేసవి మొదలు కాకముందే కరెంటు కోతలు అమలవుతున్నాయన్నారు. ప్రభుత్వాన్ని నిలదీసేందుకు బీఆర్ఎస్ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందన్నారు. రైతులకు అన్యాయం జరిగితే ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మామిడి నర్సింగరావు, ఆకుల రాజు, రాము తదితరులు పాల్గొన్నారు.


నీలిమ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న బీఆర్ఎస్ పార్టీ నేతలు

కాంగ్రెస్‌లోకి భారీగా చేరికలు

అమీర్‌పేట, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): బీజేఆర్‌నగర్-2 వేల్ఫేర్ అసోసియేషన్, సనత్‌నగర్ నియోజకవర్గం ఇన్‌చార్జి కోట నీలిమ సమక్షంలో భారీ సంఖ్యలో మహిళలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ పనితీరు చూసి తాము కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు ఆనంద్‌కుమార్, కౌశిక్, గంగాధర్, నరేశ్‌కుమార్, నవీన్‌రాజ్, మధుగౌడ్ తెలిపారు, ఈ సందర్భంగా స్థానికులు మంచినీరు, డ్రైనేజీ సమస్యల గురించి నీలిమకు విన్నవించారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన నీలిమ సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అర్హులైన లబ్ధిదారులందరికీ 6 గ్యారంటీలు అమలు చేసి తీరుతామన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు ఎస్ఎస్ రావు, శ్రీనివాస్‌రెడ్డి, రజనీకాంత్, మిరియాల రాజు, జయశ్రీగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

చెత్త నిర్వహణలో బాధ్యతగా వ్యవహరించండి

యూసుఫ్‌గూడ, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): చెత్త ఎక్కడ పడితే అక్కడ వేయకుండా బస్తీ, కాలనీవాసులకు అవగాహన కల్పించాలని యూసుఫ్‌గూడ సర్కిల్-19 డీఎంసీ సేవాలాల్ నాయక్ కోరారు. మంగళవారం వెంకటగిరి, స్రవంతినగర్, ఐలం కాలనీ, కృష్ణనగర్ ఏ బ్లాక్‌కు చెందిన పెద్దలతో ఆయన సమావేశమయ్యారు. ప్రజలు చెత్త ఎక్కడ పడితే అక్కడే వేస్తున్నారని, దీని కారణంగా పరిసరాలు, పర్యావరణం కలుషితం అవుతుందని తెలిపారు. ఈ విషయంలో కాలనీ పెద్దలు బస్తీవాసులకు అవగాహన కల్పించాలని కోరారు. చెత్తను చెత్తబండిలోనే వేసేలా చూడాలని, అప్పుడే బస్తీలు, కాలనీలు పరిశుభ్రంగా ఉంటుందన్నారు. అందరూ స్వచ్ఛభారత్ పాటించి సురక్షింతంగా ఉండేలా చూడాలని కోరారు. పులి రామ్, బరిగెల జ్ఞానేశ్వర్, బడుగు సతీష్, ఫిరోజ్‌ఖాన్, సర్దార్‌ఖాన్, బానుతేజ, విద్యాసాగర్, నవీన్‌యాదవ్, జీహెచ్ఎంసీ అధికారులు వేణు పాల్గొన్నారు.


సూచనలు చేస్తున్న డీఎంసీ సేవాలాల్ నాయక్

నకిలీ వైద్యుడిపై కేసు

బంజారాహిల్స్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక చికిత్స కేంద్రం ముసుగులో రోగులకు వైద్యం అందిస్తున్న వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. బంజారాహిల్స్ రోడ్డు నెంబరు-2 ఇందిరానగర్ పక్కన జవహర్‌నగర్‌లో జి.రామకృష్ణ ప్రథమ చికిత్స కేంద్రాన్ని ప్రారంభించాడు. అతనికి ఎంబీబీఎస్ పట్టా లేకున్నప్పటికీ రోగులకు మందులు ఇస్తున్నాడు. అంతే కాదు కేంద్రంలో మూడు పడకలు ఏర్పాటు చేసి సెలైన్‌లు, ఇంజెక్షన్‌లు ఇస్తూ వైద్యం అందిస్తున్నాడు. సమాచారం అందుకున్న మెడికల్ విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించి రామకృష్ణ నకిలీ వైద్యుడని పేర్కొంటూ బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వివిధ సెక్షన్‌ల కింద కేసు నమోదు చేసుకొన్నారు.

ఆలయంలో చోరీకి విఫలయత్నం

గుర్తు తెలియని వ్యక్తులు ఆలయంలో చొరబడి హుండీని పగులగొట్టేందుకు విఫలయత్నం చేశారు. బంజారాహిల్స్ రోడ్డు నెంబరు 11 ఉదయ్‌నగర్ వీరాంజనేయస్వామి ఆలయంలోకి ఈనెల 12న గుర్తుతెలియని ఇద్దరు దుండగులు తలుపులు పగులగొట్టి లోపలికి ప్రవేశించారు. హుండీని పగులగొట్టి అందులో ఉన్న డబ్బు దొంగలించేందుకు ప్రయత్నిస్తుండగా శబ్దం విని ఆలయ ప్రాంగణంలో ఉండే అర్చకులు బస్తీ వాసులకు తెలిపారు. అనంతరం బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బస్తీవాసులు పోగవడం గమనించి దుండగులు అక్కడి నుంచి పారిపోయారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రహ్మత్‌నగర్ హనుమాన్ ఆలయ కమిటీ అధ్యక్షుడి మృతి

యూసుఫ్‌గూడ, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): రహ్మత్‌నగర్ హనుమాన్ ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎస్.గోపాల్ రెడ్డి(50) సోమవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలిసిన వార్డు కమిటీ మాజీ సభ్యులు, ఆలయ చైర్మన్ కాసాల అరుణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి జగన్, కమిటీ సభ్యులు సంజీవగౌడ్, అనిల్‌కుమార్, శ్రవణ్‌లు గోపాల్‌రెడ్డి నివాసానికి వెళ్లి సంతాపం ప్రకటించారు. బుధవారం ఈఎస్ఐ శ్మశానవాటికలో గోపాల్‌రెడ్డి అంత్యక్రియలు జరుగుతాయని వారు తెలిపారు.


గోపాల్‌రెడ్డి(ఫైల్)

మహిళతో కల్లు దుకాణ వాచ్‌మన్ అసభ్య ప్రవర్తన

యూసుఫ్‌గూడ, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): కల్లు దుకాణానికి వచ్చిన మహిళపై వాచ్‌మన్ అసభ్యంగా ప్రవర్తించిన సంఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఎస్సీఆర్‌హిల్స్ బ్రహ్మశంకర్‌నగర్‌కు చెందిన నాగమణి తండ్రికి కల్లుతాగే అలవాటు ఉంది. అతను నడవలేని స్థితిలో ఉండటం వల్ల ఈనెల 11 యూసుఫ్‌గూడలోని కల్లు దుకాణానికి నాగమణి వెళ్లింది. ఆ సమయంలో అక్కడ వాచ్‌మన్‌గా ఉన్న రాజేందర్ ఆమెతో అసభ్యంగా ప్రవర్తించాడు. ఈ విషయం అక్కడ కౌంటర్‌లో ఉన్న వ్యక్తికి తెలియచేసింది. దీంతో రాజేందర్ ఆమెపై దాడి చేశాడు. ఇంటికి వెళ్లిన బాధితురాలు మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ప్రేమ నిరంతరం ఉండాలి

ఇద్దరు వ్యక్తుల మధ్య సహజంగా జరిగే ప్రక్రియ ప్రేమ. సమాజంలో మనిషిని ఆకర్షించడం వింత కాదు. ఆకర్షించకపోవడమే ఓ వింత. ప్రేమించడానికి ఒక ప్రత్యేకమైన రోజు అవసరం లేదు. ఫిబ్రవరి 14ని కొన్ని వ్యాపార, వాణిజ్య సంస్థలు తమ వ్యాపారం కోసం వాడుకుంటున్నాయి. ప్రేమ చాలా సహజ సిద్ధంగా ఉండాలి. కులం, మతం, ప్రాంతాలు ఆర్థిక వ్యత్యాసాలు అడ్డుగా ఉండకూడదు. ఎలాంటి నిబంధనలు లేకుండా జీవిత భాగస్వామిని ఎంచుకునే అవకాశం ఇద్దరికీ ఉండాలనేది నేటి యువత అభిప్రాయం. యుక్త వయస్సులో ప్రేమించుకొని కులాంతర, మతాంతర వివాహం చేసుకున్న వారి మనోగతం ప్రేమికుల రోజు సందర్భంగా..

- బోరబండ, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి)

ప్రేమ పెళ్లిలో కట్నం డిమాండ్ ఉండదు



పెళ్లి గురించి స్వేచ్ఛగా నిర్ణయం తీసుకునే హక్కు రాజ్యాంగం మనకు కల్పించింది. ఈ మధ్య కాలంలో కుల దురహంకార దాడులు, హత్యలు వింత పోకడలకు పోతున్నారు. పిల్లలకు తల్లిదండ్రులు హక్కు లు, బాధ్యతలపై అవగాహన కల్పించాలి. ప్రేమ వివాహాలను పోత్సహించడం ద్వారా సాంఘిక దురాచారాలు తగ్గుతాయి. వరకట్నం డిమాండ్ ఉండదు. మహిళలను చులకనగా చేసే స్వభావం తొలగిపోతుంది.

- మహ్మద్ వాహెద్, కుల నిర్మూలన సంఘం అధ్యక్షుడు

సాంస్కృతిక వ్యత్యాసం ఉంటుంది



కులాంతర, మతాంతర వివాహంలో కొంత సంస్కృతులు, సంప్రదాయాల్లో తేడాలు ఉంటాయి. ఆ వ్యత్యాసాలను సమన్వయం చేసుకుంటూ పోతున్నాము. సమన్వయం లోపించినప్పుడు చిన్నచిన్న గొడవలు జరుగుతున్నాయి. కులం పోవాలంటే అంబేడ్కర్ కోరుకున్న కులాంతర వివాహాలు పెరగాలి. కులాంతర వివాహాలను సమాజం అంగీకరించడం లేదు.

- డాక్టర్ ఇనప ఉపేందర్, ఒప్పంద అధ్యాపకులు

ప్రారంభంలో ఇబ్బందులు తప్పవు



ప్రేమ పెళ్లిని పెద్దలు అంగీకరించడం లేదు. అనివార్య పరిస్థితిలో బయటకు రావాల్సి వస్తుంది. చుట్టు ప్రక్కల వారు, బంధువుల నుంచి ఎలాంటి ప్రోత్సాహం ఉండదు. చాలా కష్టాలు ఎదుర్కొని నిలబడి ఆర్థికంగా స్థిరపడిన తరువాత అందరూ దగ్గరవుతారు. బీ ఫార్మసీ చదువుతున్నప్పుడు ప్రేమించుకొని కులాంతర వివాహం చేసుకున్నాము.

- ఎస్.అఖిల్, మెడికల్ ఎగ్జిక్యూటివ్ పీఆర్‌నగర్

కులాంతర వివాహాలు అవసరం

ఫిబ్రవరి 14 వాలంటైన్స్ స్మృతిలో జరుపుకుంటున్నారు. రాజరిక వ్యవస్థలో ఉన్న పెళ్లితంతును వ్యతిరేకించి నిలబడి ప్రేమ పెళ్లిలు చేసి జైలుకి వెళ్లాడు. ప్రేమికుల దినోత్సవాన్ని వ్యాపార దృష్టితో చేడటాన్ని వ్యతిరేకిస్తున్నాము. కొన్ని మతపరమైన సంస్థలు తీసుకుంటున్న నిర్ణయాల వలన పిల్లలు మానసిక ఒత్తికి గురవుతున్నారు. కులాంతర వివాహాలు సమాజానికి చాలా అవసరం. కులాంతర వివాహాలతో జన్యుపర సమస్యలను అధిగమించొచ్చు.

- యాదుల్ల జ్యోతి, గృహిణి

ప్రేమ వివాహాలను గుర్తించాలి

కులాంతర, మతాంతర వివాహితులను కాపాడుకోవడానికి ప్రత్యేక చట్టం తేవాలి. కులాంతర వివాహాలు చేసుకున్నా వారిని ఆదర్శ భారతీయులుగా గుర్తించి విద్య, ఉద్యోగ నియామకాల్లో ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించాలి. కులం వద్దనే వారికి ప్రత్యేక హోదా ఇవ్వాలి. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే కుల గణనలో కులం వద్దనే వారి సమాచారం సేకరించాలి.

- రంజిత్, పీడీఎస్‌యూ మాజీ రాష్ట్ర నాయకులు

గృహజ్యోతి వివరాల అప్‌డేట్ నిరంతర ప్రక్రియ

● తెల్లరేషన్ కార్డు ఉన్న వారి వివరాల సేకరణ

● స్పాట్ బిల్లింగ్ మెషీన్లలో నమోదు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): గృహజ్యోతి వివరాల అప్‌డేట్ నిరంతర ప్రక్రియ అని విద్యుత్‌శాఖ అధికారులు తెలిపారు. 'ఆంధ్రజ్యోతి'లో మంగళవారం వచ్చిన 'వస్తారా.. వెళ్లాలా..?' గృహజ్యోతి వివరాల సేకరణపై అస్పష్టత అనే కథనానికి వివిధ ప్రాంతాల్లో దరఖాస్తుదారుల వివరాలు సేకరిస్తున్న విద్యుత్ అధికారులు స్పందించారు. ప్రజాపాలనలో గృహజ్యోతికి దరఖాస్తు చేసుకున్న వారి వివరాలు స్పాట్ బిల్లింగ్ మెషిన్ల (ఎస్‌పీఎం)లో అప్‌డేట్ చేయడంతో పాటు తెల్లరేషన్‌కార్డు ఉండి ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకోలేని వారి వివరాలు కూడా నమోదు చేసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. కాలనీలు, బస్తీల్లో విద్యుత్‌సిబ్బంది, అధికారులు ఇళ్లకు వెళ్లినప్పుడు కొంత మంది గృహాల్లో ఉండడం లేదని అలాంటి వారికోసం సమీపంలో ప్రత్యేక కౌంటర్లు, హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేసి విద్యుత్ సిబ్బంది ట్యాబ్‌లు, ఫోన్లలో గృహజ్యోతి వివరాలు అప్‌డేట్ చేస్తున్నట్లు తెలిపారు. సర్వర్ సమస్య తలెత్తిన ప్రాంతాల్లో విద్యుత్ సిబ్బంది కనెక్షన్‌దారుడి నుంచి వివరాలు సేకరించి ఆ తర్వాత ఎస్‌పీఎంలో అప్‌డేట్ చేస్తున్నట్లు తెలిపారు. అద్దె ఇళ్లల్లో నివాసముండే వారికి తెల్లరేషన్ కార్డు ఉంటే మీటర్ ఎవరిపేరు మీద ఉన్నా వారి వివరాలు కూడా స్పాట్ బిల్లింగ్ మెషిన్లలో అప్‌డేట్ చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.


వివరాలు ఇచ్చేందుకు క్యూలో నిలబడిన వినియోగదారులు

గృహజ్యోతి అప్‌డేట్‌కు.. సర్వర్ డౌన్!

గృహజ్యోతి వివరాల నమోదులో సర్వర్‌డౌన్ సమస్యలు తలెత్తుతున్నాయి. రామంతాపూర్‌లో ఓ వినియోగదారుడు మంగళవారం గృహజ్యోతి వివరాల నమోదు చేయించుకునేందుకు హెల్ప్‌డెస్క్ వద్దకు వెళ్లాడు. విద్యుత్ సిబ్బంది ఫోన్‌లో వివరాలు అప్‌లోడ్ చేయకుండా ఓ పేపర్‌లో వివరాలు నమోదుచేసుకున్నారు. కారణం అడిగితే సర్వర్ డౌన్ అని చెప్పడంతో వినియోగదారుడు ఆగ్రహం వ్యక్తంచేశాడు. ఇక్కడే వివరాలు ఫోన్‌లో చూస్తే స్పష్టత వస్తుందని, ఏమైనా తప్పులున్నా వెంటనే సవరించుకునే అవకాశముంటుందని అన్నారు. పేపర్‌లో రాసిన వివరాలు పోతే మళ్లీ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిందేనని పలువురు వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేశారు.

ఆర్మీ స్పోర్ట్స్ స్కూల్‌కు హైదరాబాద్ సెయిలర్లు ఎంపిక

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): హుస్సేన్‌సాగర్ తీరంలోని యాచ్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ (వైసీహెచ్)లో శిక్షణ పొందుతున్న సెయిలర్లు బి.బన్నీ, అక్షయ్ కుమార్ మైసూర్‌లోని ఆర్మీ స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపికయ్యారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా న్యూఢిల్లీలో నిర్వహించిన సెలెక్షన్స్‌లో నెగ్గి, సబ్ జూనియర్ ఫ్లీట్ విభాగంలో వీరికి ఆర్మీ స్కూల్‌లో ప్రవేశం లభించింది. బన్నీ పేద రైతు కుటుంబం నుంచి రాగా, అక్షయ్ తండ్రి క్యాబ్ డ్రైవర్. ప్రస్తుతం బన్ని సబ్ జూనియర్ విభాగంలో భారత్ నెంబర్ 2 ర్యాంక్‌లో కొనసాగుతున్నాడు.


ఎంపికైన యాచ్ క్లబ్ సెయిలర్లు

ఏసీబీకి చిక్కిన దూద్‌బౌలి ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్

మదీన, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): సేల్ డీడ్ ఆస్తులను రిజిస్ట్రేషన్ చేయడానికి ఓ వ్యక్తి నుంచి రూ. 2లక్షలు లంచం తీసుకుంటూ దూద్‌బౌలి ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. పాతనగరం దూద్‌బౌలి సబ్‌రిజిస్ట్రార్ ఆరు నెలల క్రితం బదిలీకావడంతో ఆయన స్థానంలో అదే కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా ఉన్న అమిర్ ఫరాజ్ ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. షాలిబండకు చెందిన సయ్యద్ షహబాజ్, అతని స్నేహితుడు పర్వేజ్‌కు చెందిన రెండు సేల్‌డీడ్ పత్రాలను ఒకటి తన పేరు మీద, మరొకటి స్నేహితునితో కలిసి జాయింట్ రిజిస్ట్రేషన్ చేయమని కోరాడు. దీనికి అమిర్ ఫరాజ్ రూ. 2లక్షలు లంచం అడిగాడు. దీనికి అంగీకరించిన సయ్యద్ షహబాజ్ రిజిస్ట్రార్ సూచన మేరకు కార్యాలయంలో హెల్పర్‌గా పనిచేసే గోపీసింగ్‌కు నగదు అందించాడు. అప్పటికే మాటువేసిన ఏసీబీ అధికారులు గోపీసింగ్‌ను, ప్రధాన నిందితుడైన ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆమెర్ ఫరాజ్‌లను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.


ఏసీబీకి చిక్కిన అమిర్ ఫరాజ్

స్నూకర్ విజేత సుశీల్ జోడీ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): రాష్ట్రస్థాయి స్నూకర్ చాంపియన్‌షిప్ పోటీల్లో టీమ్ విభాగంలో సుశీల్-అమన్ జోడీ విజేతగా నిలిచింది. వారం రోజులుగా జూబ్లీహిల్స్‌లోని పూల్ స్నూకర్ అకాడమీలో జరుగుతున్న ఈ పోటీలు మంగళవారం ముగిశాయి. ఫైనల్లో సుశీల్-అమన్ ద్వయం 3-0తో బ్రాండన్-రవీష్‌పై నెగ్గి, ట్రోఫీ దక్కించుకుంది. ఈ పోటీల్లో 100 మందికి పైగా క్రీడాకారులు పాల్గొన్నారు. తెలంగాణ క్యూ స్పోర్ట్స్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ అప్పారావు, అకాడమీ నిర్వాహకులు శ్రవణ్, సందీప్ రెడ్డి, విజేతలకు ట్రోఫీలు బహూకరించారు.


రాష్ట్ర స్థాయి స్నూకర్ చాంపియన్‌షిప్‌లో విజేతగా నిలిచిన సుశీల్-అమన్ జోడీ

తెలుగు భాషా పరిరక్షణకు చిట్టెన్‌రాజు విశేష కృషి

చిక్కడపల్లి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): తెలుగుభాషా పరిరక్షణకు చిట్టెన్‌రాజు విశేషకృషి చేస్తున్నారని వేంకటేశ్వరయూనివర్సిటీ మాజీ వీసీ ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. ప్రపంచవ్యాప్తంగా తొమ్మిది దేశాలలో ప్రపంచ తెలుగు మహాసభలు స్వయంగా నిర్వహించడం ప్రభుత్వాలు కూడా చేయలేని పని అని, అమెరికాలో ఉండి భాషా సంస్కృతి పట్ల ఆయన అభిమానం చాటుకుంటున్నారన్నారు. వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా త్రిదశాబ్ది వేడుకల సందర్భంగా మంగళవారం రాత్రి త్యాగరాయగానసభలో నాలుగు గ్రంథాల ఆవిష్కరణ సభ జరిగింది. ఆచార్య ఇనాక్ మాట్లాడుతూ.. రచయిత లేకుంటే ఏ కళాప్రక్రియ లేదన్నారు. నటుడు తనికెళ్ల భరణి శ్రీదేవి మురళీధర్ రచించిన స్వయంసిద్ధ నవలను ఆవిష్కరించి మాట్లాడారు. నటి రేఖ జీవితచరిత్ర స్వయంసిద్ధ అని, అది అత్యుత్తమ జీవితచరిత్ర అన్నారు. వంగూరి చిట్టెన్‌రాజు రచించిన అమెరికా కాకరకాయ కథలు సినీ గీత రచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు, దయాస్పోరా తెలుగు కథల సంకలనంను సాహితీవేత్త డా.ఓలేటి పార్వతీశం, అర్ధ శతాబ్దిలో అమెరికా తెలుగుకథలు సంపుటిని అవధాని కడిమెళ్ల వరప్రసాద్ ఆవిష్కరించారు. రాధిక మంగిపూడి, వంశీరామరాజు తదితరులు పాల్గొన్నారు.


పుస్తకాలను ఆవిష్కరిస్తున్న అతిథులు

పాతబస్తీలో ఐటీ సోదాలు

చాంద్రాయణగుట్ట, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): పాతబస్తీ ఫలక్‌నుమాలో మంగళవారం ఉదయం కింగ్స్ గ్రూప్ అధినేత షానవాజ్ ఇంట్లో ఐటీ అధికారులు సోదాలు నిర్వహించారు. షానవాజ్ ఇంట్లో అసెంబ్లీ ఎన్నికలకు ముందు నవంబర్‌లో కూడా సోదాలు జరగగా, తాజాగా పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఐటీ అధికారులు సోదాలు నిర్వహించడం పాతబస్తీలో హాట్ టాపిక్‌గా మారింది. షానవాజ్ ఇంట్లో గతంలో కూడా పలుమార్లు ఐటీ దాడులు జరిగాయి.

● చలో నల్గొండ


వెంగళరావునగర్ డివిజన్ కార్పొరేటర్ దేదీప్య ఆధ్వర్యంలో యూసుఫ్‌గూడ కృష్ణకాంత్ పార్కు నుంచి చలో నల్గొండ సభకు వెళ్తున్న బీఆర్ఎస్ నాయకులు.

- వెంగళరావునగర్, ఆంధ్రజ్యోతి

విశ్వవిద్యాలయాలకు పెద్దపీట వేయాలి

తార్నాక, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం విశ్వవిద్యాలయాలకు పెద్దపీట వేయాలని ఓయూ జేఏసీ, బహుజన విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో విద్యార్థి నాయకులు మాట్లాడారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీని గద్దెదింపి, కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడంలో నిరుద్యోగ విద్యార్థులు కీలకపాత్ర పోషించారని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పది సంవత్సరాలుగా రాష్ట్రంలో విద్యా వ్యవస్థలను పూర్తిగా భ్రష్టుపట్టించిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం విశ్వవిద్యాలయాలకు ప్రత్యేకంగా నిధులు కేటాయించి తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో బీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వేల్పుల సంజయ్, ఓయూ జేఏసీ చైర్మన్ కొత్తపల్లి తిరుపతి, సోమల అంబేడ్కర్, చందు, అనంద్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

నగ్న ఫొటోలు, వీడియోలతో యువతికి బెదిరింపులు

యూసుఫ్‌గూడ, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): పెళ్లి చేసుకుంటానని చెప్పి లైంగికదాడి చేసి అనంతరం నగ్న ఫొటోలు, వీడియోలు అందరికీ చూపిస్తానని బెదిరింపులకు పాల్పడుతున్న వ్యక్తిపై మధురానగర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరానికి చెందిన ఓ యువతి గతంలో దిల్‌సుఖ్‌నగర్‌లో ఓ సంస్థలో పని చేసేది. అక్కడ దీపక్‌మోహన్ అనే వ్యక్తి పరిచయమయ్యాడు. ఆ తరువాత అక్కడ జీతం పెంచటంలేదని ఆమె ఎస్ఆర్‌నగర్‌లోని మరో సంస్థలో ఉద్యోగంలో చేరింది. అయితే, దీపక్‌మోహన్ తరచూ ఇక్కడికి వచ్చి ఆమెను వేధించేవాడు. గతేడాది జనవరి 24న పెళ్లి చేసుకుంటానని, మాట్లాడుకుందామని ఓ హోటల్‌కు తీసుకెళ్లి లైంగికదాడి చేసి నగ్న ఫొటోలు, వీడియోలు తీశాడు. ఆ తరువాత సోమశిల రమ్మని ఫోన్ చేశాడు. 'నీ నగ్నఫొటోలు, వీడియోలు డిలీట్ చేస్తాను'అని చెప్పటంతో సోమశిల వెళ్లింది. ఆమెపై అక్కడ కూడా మరోసారి చేసి ఫోన్‌లోని ఫొటోలు డిలీట్ చేశాడు. ఆ తరువాత కూడా ఫొటోలు, వీడియోలు వేరే డ్రైవ్‌లో ఉన్నాయని మళ్లీ వేధించడం మొదలుపెట్టాడు. దీంతో విసిగిపోయిన ఆ యువతి మధురానగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమంగా నిల్వ చేసిన సరుకులు పట్టివేత

అల్లాపూర్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా నిల్వచేసిన రేషన్ బియ్యం, పీడీఎస్ గోధుమలు, కల్తీ నూనెలను అల్లాపూర్ పోలీస్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిని అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విశ్వసనీయ సమాచారం మేరకు పద్మావతినగర్‌లో రూ.10 లక్షలు విలువజేసే 20 టన్నుల ప్రజా పంపిణీ వ్యవస్థకు సంబంధించిన గోధుమలు, క్వింటాళ్ల కొద్ది రేషన్ బియ్యం, కల్తీ నూనెలను బాలానగర్ ఎస్ఓటీ పోలీసులు మంగళవారం గుర్తించారు. అనంతరం గోధుమలు, బియ్యాన్ని స్టేట్ సివిల్ సప్లైస్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు అప్పగించారు.

ట్రాఫిక్ జాయింట్ సీపీగా జోయల్ డేవిస్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): సైబరాబాద్ కమిషనరేట్ ట్రాఫిక్ జాయింట్ పోలీస్ కమిషనర్‌గా జోయల్ డేవిస్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్రంలో సోమవారం రాత్రి జరిగిన ఐపీఎస్ అధికారుల బదిలీల్లో జోయల్ డేవిస్‌ను ట్రాఫిక్ జాయింట్ సీపీగా ప్రభుత్వం నియమించింది. అక్కడ జాయింట్ సీపీగా ఉన్న నారాయన్ నాయక్‌ను ఎస్సీఆర్‌బీ, సీఐడీ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్‌గా నియమించింది.


జోయల్ డేవిస్

జేఈఈ మెయిన్స్‌లో సత్తాచాటిన విద్యార్థులు

రాయదుర్గం, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్ పరీక్షల్లో గౌలిదొడ్డి సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల విద్యార్థులు 80మంది ఐఐటీ అడ్వాన్స్ పరీక్షకు అర్హత సాధించి సత్తాచాటారు. ఏర్రంబాటి సాయిరామ్ 99.46శాతంతో ప్రథమ స్థానంలో నిలవగా, ఊట్కూరి వెంకటేష్ 99.31శాతంతో రెండో స్థానంలో నిలిచి ఐఐటీ అడ్వాన్స్ పరీక్షకు అర్హత సాధించారు. 22మంది విద్యార్థులు 90శాతం పైగా, 40మంది 80శాతం పైగా, 56మంది 60శాతం పైగా, 80మంది విద్యార్థులు 50శాతంతో జూన్‌లో జరిగే ఐఐటీ అడ్వాన్స్ పరీక్షకు అర్హత సాధించారు.

ఫిబ్రవరి 13ను వివేకానంద డేగా గుర్తించాలి

స్వామి బోధమయానంద

రెజిమెంటల్‌బజార్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం ఫిబ్రవరి 13వ తేదిని వివేకానంద డేగా గుర్తించాలని రామకృష్ణ మఠం అధ్యక్షులు స్వామి బోధమయానంద అన్నారు. 1893 ఫిబ్రవరి 13న స్వామి వివేకానంద తన జీవితంలో మొదటిసారి సికింద్రాబాద్‌లోని మహబూబ్ కాలేజీలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో చేసిన ఆంగ్ల ప్రసంగం చికాగో ప్రసంగం విజయవంతమవడానికి స్ఫూర్తిగా నిలిచిందని అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం సికింద్రాబాద్‌లోని ఎస్‌వీఐటీ కాలేజ్ అడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమానికి స్వామి బోధమయానంద ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ చారిత్రక ఘట్టాన్ని తగిన ప్రాధాన్యమిస్తూ ప్రతి సంవత్సరం వారం రోజులపాటు కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. ఈ సందర్భంగా చంద్రకాంత్ సాగర్‌ను మఠం స్వాములు సన్మానించారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ మఠం స్వాములు, మహబూబ్ కాలేజీ, స్కూల్ కమిటీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.


ప్రసంగిస్తున్న స్వామి బోధమయానంద

స్నేహితుడిపై హత్యాయత్నం

మద్యం బాటిల్‌తో విచక్షణారహితంగా దాడి

దిల్‌సుఖ్‌నగర్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో స్నేహితునిపై విచక్షణారహితంగా కత్తితో దాడి చేసిన సంఘటన సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మలక్‌పేట గంజ్‌లో హమాలీలుగా పనిచేస్తూ ఫుట్‌పాత్‌పై జీవనం సాగిస్తున్న శ్రీనివాస్ (28), జమీల్ స్నేహితులు. వీరిద్దరూ సోమవారం రాత్రి సెకండ్ షో సినిమా చూసేందుకు దిల్‌సుఖ్‌నగర్‌లోని కోణార్క్ థియేటర్‌కు వెళ్లారు. సినిమాకు వెళ్ళడానికి ముందు మద్యం తాగారు. అనంతరం మరో నలుగురు మిత్రులతో కలిసి వీరిద్దరు సినిమాకు వెళ్లారు. ఇంటర్వెల్ సమయంలో బయటకు వచ్చారు. ఆ సమయంలో శ్రీనివాస్, జమీల్‌ల మధ్య మాటా మాటా పెరిగింది. ఈ క్రమంలో ఆగ్రహానికి గురైన జమీల్ సమీపంలో ఉన్న మద్యం బాటిల్ తీసుకుని శ్రీనివాస్‌పై దాడికి దిగాడు. దీంతో శ్రీనివాస్ మెడతెగి తీవ్రరక్తస్రావమైంది. అక్కడినుంచి తప్పించుకున్న శ్రీనివాస్ గంజ్‌కు వెళ్తుండగా మలక్‌పేట చర్మాస్ వద్ద స్పృహతప్పి పడిపోయాడు. అతన్ని గమనించిన స్థానికులు 100కు సమాచారం ఇచ్చారు. దీంతో చాదర్‌ఘాట్ పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి శ్రీనివాస్‌ను ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం దాడి గురించి వెల్లడించాడు. చాదర్‌ఘాట్ పోలీసుల సమాచారంతో శ్రీనివాస్ నుంచి ఫిర్యాదు తీసుకున్న సరూర్‌నగర్ పోలీసులు జమీల్‌పై హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.


చికిత్స పొందుతున్న శ్రీనివాస్



మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభోత్సవంలో ముఖేష్ తారే, తదితరులు

మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం

సికింద్రాబాద్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛమైన నీరు దొరకక ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులు అనారోగ్యం బారిన పడుతున్నారని డ్యూ పాయింట్ సంస్థ ఇండియా డైరెక్టర్ ముఖేష్ తారే ఆవేదన వ్యక్తం చేశారు. మడ్‌ఫోర్టులోని ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో డ్యూ పాయింట్ సంస్థ సౌజన్యంతో సేఫ్ వాటర్ నెట్‌వర్క్ స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేసిన 1000 లీటర్ల సామర్థ్యం కలిగిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఆయన మంగళవారం ప్రారంభించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షెడిక్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రాంతాల్లోని మురికివాడల్లో నివసిస్తున్న పేద విద్యార్థులు స్వచ్ఛమైన నీటిని అందించాలనే లక్ష్యంతో దేశ వ్యాప్తంగా ఇటువంటి నీటి శుద్ధి యంత్రాలను ఏర్పాటు చేస్తున్నట్టు వెల్లడించారు. సేఫ్ వాటర్ నెట్‌వర్క్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ పూనం సేవక్ మాట్లాడుతూ తమ సంస్థ తరపున ఇప్పటికే హైదరాబాద్ నగరంలో 53 ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత మినరల్ వాటర్ ప్లాంట్లు ప్రారంభించినట్టు తెలిపారు. విద్యార్థులకు స్వచ్ఛమైన నీటిని అందించడంతోపాటు పిల్లల హాజరు శాతం పెంచడమే లక్ష్యంగా పని చేస్తున్నట్టు వివరించారు. సేఫ్ వాటర్ నెట్‌వర్క్ ఇండియా ప్రతినిధులు శంకర్‌లాల్ భద్ర, మల్లికార్జున్, శ్రీకాంత్, జితేందర్, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.



ముత్యాలమ్మ ఆలయంలో శిఖర కలశస్థాపన, అమ్మవారికి అభిషేక పూజలు చేస్తున్న వేదపండితులు, స్థానికులు

నేడు ముత్యాలమ్మ విగ్రహ ప్రతిష్ఠ

బోయినపల్లి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): బోయినపల్లి బాపూజీనగర్‌లోని ముత్యాలమ్మ దేవాలయం పునర్నిర్మాణం జరిగింది. ఈ నేపథ్యంలో ఆలయ ప్రారంభం, ముత్యాలమ్మ విగ్రహ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాలు మూడు రోజులపాటు ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్నారు. సికింద్రాబాద్ మహంకాళి ఆలయ ప్రధాన అర్చకులు బ్రహ్మశ్రీ వేణుమాధవ శర్మ వేదపండితుల బృందం చేతులమీదుగా ఆలయ చైర్మన్ జంపన్న పరతాప్, ఆలయ అధ్యక్షుడు దుర్గయ్యల ఆధ్వర్యంలో భక్తి శ్రద్ధలతో అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. రెండో రోజు మంగళవారం ఆలయ శిఖర కలశస్థాపన హోమాలు, అమ్మవారికి అభిషేకాలు, ద్వారపూజ, మంగళహారతి, అగ్ని ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమాన్ని తిలకించడానికి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అభిషేక పూజల్లో పాల్గొన్నారు. బుధవారం ఆలయంలో ముత్యాలమ్మ విగ్రహ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం, అమ్మవారికి బోనాల సమర్పణ, యంత్ర ప్రతిష్ఠ, బలిహారం, పూర్ణాహుతి, అలంకరణ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, భక్తులందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కాగలరని వేదపండితుడు వేణుమాధవవర్మ తెలిపారు. భక్తులకు అన్నదానం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.



మెడికల్ క్యాంప్‌ను పరిశీలిస్తున్న కార్పొరేటర్ చీర సుచిత్ర

పేదలకు అందుబాటులో డిజిటల్ సేవలు


- కార్పొరేటర్ చీర సుచిత్ర శ్రీకాంత్

రాంగోపాల్‌పేట్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): బ్యాంకు సేవలు, ఉచిత ఆరోగ్య చికిత్స కేంద్ర, ఆధార్ కార్డులో వివరాల మార్పులు చేర్పులు, వంటగ్యాస్ కనెక్షన్ సేవలు, పోస్టల్ సేవలు తదితర డిజిటల్ సేవలను ప్రభుత్వ అధికారులు ఉద్యోగుల ద్వారా ప్రజలకు అందుబాటులోకి తేవడమే ఈ వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర లక్ష్యమని రాంగోపాల్‌పేట్ కార్పొరేటర్ చీర సుచిత్ర శ్రీకాంత్ అన్నా రు. మంగళవారం డివిజన్ పరిధిలోని మెక్లోడ్ గూడ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన శిబిరాన్ని ప్రారంభించి, శిబిరంలో జరుగుతున్న సేవలను పరిశీలించారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రజల చెంతకే వచ్చిన ఇలాంటి సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్పీఓ జయశ్రీ, బ్యాంక్ ఆఫ్ ఇండియా బీఎం అనిల్ కుమార్, బీజేపీ రాంగోపాల్‌పేట్ డివిజన్ అధ్యక్షుడు ప్రతాప్, ప్రధాన కార్యదర్శి నరేష్, సీనియర్ నాయకులు చీర శ్రీకాంత్, మధన్, నితేష్ బోలే, శ్రీధర్, శ్రీనివాస్ కుమార్ యాదవ్, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

కారుణ్య నియామకాలు చేపట్టాలి: సీపీఎం

రాంనగర్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డులో కారుణ్య నియామకాలు చేపట్టాలని సీపీఎం నగర కార్యదర్శి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డికి రాసిన బహిరంగ లేకను ఆయన విడుదల చేశారు. సీపీఐ నగర కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కంటోన్మెంట్ బోర్డులో వివిధ హోదాలలో పని చేస్తున్న 102 మంది ఉద్యోగులు చనిపోయారని, వీరిలో 80 శాతం మంది బలహీన వర్గాల కుటుంబాలకు చెందిన వారేనని గుర్తు చేశారు. చనిపోయిన కుటుంబాలకు చెందిన వారిని కారుణ్య నియామకం కింద ప్రతియేటా 5 శాతం మందిని నియమించాలని ఆదేశాలు ఉన్నప్పటికీ.. పదేళ్లలో ఒక్కరిని కూడా నియమించకుండా కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. కారుణ్య నియామకాలను వెంటనే చేపట్టాలని 2022లో రక్షణ శాఖ అధికారులకు వినతిపత్రం అందజేసినా నేటికీ చర్యలు చేపట్టలేదన్నారు. మరణించిన ఉద్యోగుల కుటుంబ సభ్యులు కంటోన్మెంట్ బోర్డు అధికారుల చుట్టూ తిరుగుతున్నారన్నారు. లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ రాకముందే కారుణ్య నియామకాలు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు.

వాహనాలను ధ్వంసం చేస్తున్న వ్యక్తి అరెస్ట్



నిందితుడు ఏలూరి బాలాజీ

బోయినపల్లి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): రాత్రి సమయాల్లో వీధుల్లో పార్క్‌చేసిన వాహనాలపై రాళ్లు రువ్వుతూ వాటి సామగ్రిని దొంగిలిస్తూ హల్‌చల్ చేస్తున్న ఓ యువకుడిని బోయినపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణరెడ్డి వివరాల ప్రకారం... ఓల్డ్ బోయిన్‌పల్లిలో నివాసం ఉంటున్న ఏలూరి బాలాజీ (19) కొన్ని రోజులుగా ఆర్‌ఆర్ నగర్, ఓల్డ్ బోయిన్‌పల్లి ప్రాంతాల్లో అర్ధరాత్రి సంచరిస్తూ ఇళ్ల ముందు పార్కింగ్ చేసిన బైక్‌లను, కార్‌లను రెక్కీ నిర్వహించి అనంతరం అర్ధరాత్రి రెండు గంటలు దాటిన తర్వాత వాహనాలు ఇనుప సామగ్రి, అద్దాలు దొంగిలిస్తూ వాహనాలను ధ్వంసం చేస్తూ హల్‌చల్ చేస్తున్నాడు. సోమవారం రాత్రి గస్తీ నిర్వహిస్తున్న పోలీసులకు అనుమానంగా తిరుగుతున్న ఏలూరి బాలాజీ కనిపించాడు. దీంతో అతడిని ప్రశ్నించగా అతని వద్ద నుంచి ఎలాంటి సమాధానం రాలేదు. అనుమానం వచ్చి పోలీస్‌స్టేషన్‌కు తరలించి సీసీ కెమెరాలను పరిశీలించగా కొన్ని రోజులుగా ఓల్డ్ బోయినపల్లిలో హల్‌చల్ చేస్తున్నది ఇతడేనని గుర్తించిన పోలీసులు బాలాజీని అదుపులోకి తీసుకుని ఈ పిట్టీ కేసు నమోదుచేసి కోర్టులో హాజరుపరిచారు. దీంతో న్యాయస్థానం బాలాజీకి నాలుగు రోజులు జైలుశిక్ష విధించింది. దీంతో పోలీసులు ఏలూరి బాలాజీని రిమాండ్‌కు తరలించారు.

నిధుల కొరత లేదు.. ప్రోత్సహించేవారే కరువు

- లలిత కళాసమితికి ఎన్నికలు జరపాలి
- నూతన కార్యవర్గం ఏర్పాటు చేయాలి
- ప్రతి నెలా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలి



ముగ్గుల పోటీల్లో విజేతలకి బహుమతి అందజేస్తున్న గణేశ్వర రావు, బాషా తదితరులు

చిలకలగూడ, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): రైల్వే ఉద్యోగులు, కార్మికుల పని ఒత్తిడిని అధిగమించి ఉల్లాసంగా గడపాలనే ఉద్దేశంతో దక్షిణ మధ్య, సికింద్రాబాద్‌లో రైల్వేలో లలిత కళాసమితి సాంస్కృతిక సంస్థ 01-26-1967 రోజున స్థాపించారు. ఉద్యోగుల సంక్షేమ నిధి నుంచి కొంత సొమ్ము కేటాయిస్తారు. 800 మంది సభ్యులు ఈ సంస్థలో ఉన్నారు. సభ్యుల నుంచి నామమాత్రంగా కొంత సొమ్ము వసూలు చేసి ప్రతి నెల ఒక సాంస్కృతిక కార్యక్రమమం నిర్వహిస్తుంటారు. నిధుల కొరత, ఆడిటోరియం ఇబ్బందులు లేవు. రైల్ నిలయం ఆడిటోరియం, రైల్ కళారంగ్, మెట్టుగూడ ఆఫీసర్స్ క్లబ్, ఇరిసెట్‌లోని హాల్‌లు అందుబాటులో వున్నాయి. రాష్ట్రస్థాయి నాటక పోటీలు, నృత్య పోటీలు, పాటల పోటీలతో పాటు చిత్ర లేఖనం, వ్యాస రచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తుంటారు.

సభ్యుల పిల్లలకి వివిధ రకాల పోటీలు నిర్వహించి వారిలో వున్న సృజనాత్మకతను వెలికి తీసి ప్రోత్సహిస్తుంటారు. దిన, వార, మాస పత్రికలు అందుబాటులో వుంచి సాహిత్యానికి పెద్ద పీటవేసారు. దాదాపు 5 వేల అపురూపమైన పుస్తకాలు అందుబాటులో వున్నాయి. ఇదంతా గతం.

ప్రస్తుతం నిర్వహించవలసిన సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం లేదు. కరోనా సమయంలోనే అప్పటి కమిటీ సంవత్సరాల పదవీ కాలం పూర్తయింది. కానీ ఇప్పటి వరకు ఎన్నికలు జరుగలేదు. కార్యనిర్వాహక కమిటీ ఎన్నికలు తక్షణమే నిర్వహించి కొత్త కమిటీ ఏర్పాటు చేయాలని సభ్యులు కోరుతున్నారు. కార్మిక సంఘాలు లలిత కళాసమితి నిర్వహణ గురించి పట్టించుకోవాల్సిన అవసరముందని, ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. లలిత కళాసమితికి వెన్నుదన్నులు కల్పించి సజీవంగా వుండేలా చర్యలు చేపట్టాలని ఉద్యోగులు, కళాకారులు కోరుతున్నారు.

నాటక పోటీలకు స్పందన వుండేది



సమితి కార్యదర్శిగా పని చేశాను. సభ్యుల నుంచి తీసుకున్న సొమ్ముతో కార్యక్రమాలు నిర్వహించే వాళ్లం. నాటక పోటీలు, వార్షికోత్సవాల వంటి ప్రత్యేక కార్యక్రమాలకి స్పాన్సరర్స్ ప్రోత్సహించే వాళ్లు. సమితి నిర్వహించే నాటక పోటీలకి విశేష స్పందన వుండేది.. ఉభయ రాష్ట్రాల నుంచి నటీ, నటులు పోటీ పడే వారు. ఇక్కడ బహుమతి అందుకుంటే ప్రత్యేక గుర్తింపు వుండేది.

మంత్రి భుజంగరావు, సమితి మాజీ ప్రధాన కార్యదర్శి

కార్యక్రమాలు నిర్వహించాలి



30 ఏళ్లు సభ్యుడిగా వున్నాను. అవధానాలు, ఆధ్యాత్మిక ప్రవచనాలు, సంగీత విభావరుల వంటి కార్యక్రమాలు ఎన్నో చూశాను. కరోనా తరువాత ప్రోగ్రాంలు తగ్గి పోయాయి. మాజీ జనరల్ మేనేజర్ రామకృష్ణ అధ్యక్షుడిగా వున్నప్పుడు ఆసక్తి గొలిపే కార్యక్రమాలు ఉత్సాహంగా నిర్వహించారు. సమితి బ్రతికి వుండేలా చర్యలు చేపట్టి సంస్కృతి, సంప్రదాయాలు ఇనుమడించేలా మరిన్ని మంచి కార్యకమాలు నిర్వహించాలి.

యు. శ్రీనివాస్, (మాజీ సభ్యుడు)

మాటలు కాదు ఆచరణ ముఖ్యం

- స్వామి బోధమయానంద



ప్రసంగిస్తున్న స్వామి బోధమయానంద

రెజిమెంటల్‌బజార్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): సనాతన ధర్మ పూర్వ వైభవాన్ని పునఃస్థాపించడానికే వివేకానంద స్వామి జన్మించారని రామకృష్ణ మఠం అధ్యక్షుడు స్వామి బోధమయానంద అన్నారు. 1893 ఫిబ్రవరి 13న స్వామి వివేకానంద తన జీవితంలో మొదటి సారి సికింద్రాబాద్‌లోని మహబూబ్ కాలేజీలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో చేసిన ఆంగ్ల ప్రసంగం చికాగో చేసిన ప్రసంగం విజయవంతమవడానికి స్ఫూర్తిగా నిలిచిందన్నారు. ఈ సందర్భంగా మంగళవారం సికింద్రాబాద్‌లోని ఎస్‌వీఐటీ కాలేజ్ ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాటలు కాదు ఆచరణ ముఖ్యమని ఆచరణలో పెడితే అద్భుతాలు సృష్టించవచ్చని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఫిబ్రవరి 13వ తేదిని వివేకానంద డే గా గుర్తించాలన్నారు. ఈ చారిత్రక ఘట్టాన్ని తగిన ప్రాధాన్యత ఇస్తు ప్రతి సంవత్సరం వారం రోజుల పాటు కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.

యువత స్వామి వివేకానంద జీవితం నుంచి ఆత్మవిశ్వాసంను అలవర్చుకోవాలని సూచించారు. పుట్టుకతో 90 శాతం వైకల్యం ఉన్న చంద్రకాంత్ సాగర్ స్వామి వివేకానంద స్ఫూర్తితో ఆత్మవిశ్వాసం పెంపొందించుకుని పరిశ్రమను ఏర్పాటు చేసి పలువురికి ఉపాధి కల్పిస్తున్న ఆయనను యువత ఆదర్శంగా తీసుకోవాలని అన్నా రు. అనంతరం చంద్రకాంత్ సాగర్‌ను మఠం స్వాములు సన్మానించారు. కార్యక్రమంలో రామకృష్ణ మఠం స్వాములు, మహబూబ్ కాలేజీ, స్కూల్ కమిటీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో సత్తాచాటిన విద్యార్థులు



వై.సాయిరామ్ 99.46 శాతం



యూ.వెంకటేష్ 99.31 శాతం

రాయదుర్గం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్ పరీక్షల్లో గౌలిదొడ్డి సాంఘీక సంక్షేమ గురుకుల కళాశాల విద్యార్థులు 80మంది ఐఐటీ అడ్వాన్స్ పరీక్షకు అర్హత సాధించి తమ సత్తాచాటారు. ఏర్రంబాటి సాయిరామ్ 99.46 శాతంతో ప్రథమ స్థానంలో నిలవగా, ఊట్కూరి వెంకటేష్ 99.31శాతంతో రెండో స్థానంలో నిలిచి ఐఐటీ అడ్వాన్స్ పరీక్షకు అర్హత సాధించారు. 22 మంది విద్యార్థులు 90శాతం పైగా, 40మంది 80శాతం పైగా, 56మంది 60శాతం పైగా, 80మంది విద్యార్థులు 50శాతంతో జూన్‌లో జరిగే ఐఐటీ అడ్వాన్స్ పరీక్షకు అర్హత సాధించారు. మొత్తం వందమంది కళాశాల నుంచి పరీక్ష రాసినట్లు ప్రిన్సిపాల్ వట్టికొండ పాపారావు తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను గురుకుల సంస్థ కార్యదర్శి కె.సీతాలక్ష్మి, సంయుక్త కార్యదర్శి సక్కునాయక్, ఓఎస్‌డీ రంగారెడ్డి, ఆర్‌సీఓ డాక్టర్ శారద వెంకటేష్ అభినందించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన నిరుపేద కుటుంబాల విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని ఇంతటి విజయాలు సాధించడం అభినందనీయమని అన్నారు. భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వారు ఆకాంక్షించారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే కఠిన చర్యలు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): పబ్‌లు, మాల్స్ వద్ద ఇష్టానుసారంగా వాహనాలు ఆపి, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సైబరాబాద్ ట్రాఫిక్ డీసీపీ డీవీ శ్రీనివాసరావు హెచ్చరించారు. గచ్చిబౌలి సీపీ కార్యాలయంలో సైబరాబాద్ పరిధిలోని పబ్‌లు, మాల్స్ యాజమాన్యాలతో మంగళవారం డీసీపీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాల్స్, పబ్స్ నిర్వాహకులు ప్రత్యేక పార్కింగ్ ప్రాంతాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

కార్యక్రమంలో మాదాపూర్ అడిషనల్ ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాస్, అడిషనల్ ట్రాఫిక్ డీసీపీ మేడ్చల్ వేణుగోపాల్ రెడ్డి, ఎస్సైలు, తదితరులు పాల్గొన్నారు.

నగ్న ఫొటోలు, వీడియోలు చూపించి యువతికి బెదిరింపులు

- మధురానగర్ పీఎస్‌లో నిందితుడిపై కేసు నమోదు

యూసుఫ్‌గూడ, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి):పెళ్లి చేసుకుంటానని చెప్పి కోరిక తీర్చుకుని అనంతరం నగ్న ఫొటోలు, వీడియోలు అందరికీ చూపిస్తానని బెదిరింపులకు పాల్పడుతున్న వ్యక్తిపై మధురానగర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరానికి చెందిన ఓ యువతి గతంలో దిల్‌సుఖ్‌నగర్‌లో ఓ సంస్థలో పని చేసేది. అక్కడ దీపక్‌మోహన్ అనే వ్యక్తి పరిచయమయ్యాడు. ఆ తరువాత అక్కడ జీతం పెంచటంలేదని ఆమె ఎస్‌ఆర్‌నగర్‌లోని మరో సంస్థలో ఉద్యోగంలో చేరింది. అయితే, దీపక్ మోహన్ తరచూ ఇక్కడికి వచ్చి ఆమెను వేధించేవాడు. గతేడాది జనవరి 24న పెళ్లి చేసుకుంటానని, మాట్లాడుకుందామని ఓ హోటల్‌కు తీసుకెళ్లి లైంగిక దాడి చేసి నగ్న ఫొటోలు, వీడియోలు తీశాడు. ఆ తరువాత సోమశిల రమ్మని ఫోన్ చేశాడు. 'నీ నగ్నఫొటోలు, వీడియోలు డిలీట్ చేస్తాను'అని చెప్పటంతో సోమశిల వెళ్లింది. ఆమెపై అక్కడ కూడా మరోసారి లైంగిక దాడి చేశాడు. ఫోన్‌లోని ఫొటోలు డిలీట్ చేశాడు. తరువాత కూడా ఫొటోలు, వీడియోలు వేరే డ్రైవ్‌లో ఉన్నాయని మళ్లీ వేధించడం మొదలుపెట్టాడు. దీంతో విసిగిపోయిన ఆ యువతి మధురానగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తమ్ముడు నిప్పంటించిన కేసు.. చికిత్స పొందుతూ అన్న మృతి



శ్రీనివాస్ (ఫైల్)

బోయినపల్లి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): అన్నపై తమ్ముడు పెట్రోల్‌పోసి నిప్పంటించిన కేసులో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కందికొండ శ్రీనివాస్ మంగళవారం మృతి చెందాడు. బోయినపల్లి ఎస్‌ఐ శివశంకర్ తెలిపిన వివరాల ప్రకారం... ఆదివారం సాయంత్రం న్యూబోయినపల్లి కంసరిబజార్‌కు చెందిన కందికొండ శ్రీనివాస్ (62) అతని పెదనాన్న కుమారుడు కందికొండ వినోద్ (40)ల మధ్య దారి విషయంలో గొడవ జరిగింది. ఈ క్రమంలో శ్రీనివాస్‌పై పెట్రోల్‌పోసి నిప్పంటించాడు. కేసు నమోదుచేసుకున్న పోలీసులు నిందితుడిని ఈ నెల 12న అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు. కాలిన గాయాలతో గాంధీ ఆస్పత్రిలో మూడు రోజులుగా చికిత్స పొందుతున్న బాధితుడు శ్రీనివాస్ మంగళవారం మృతిచెందినట్లు ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి.

గృహజ్యోతి వివరాల అప్‌డేట్ నిరంతర ప్రక్రియ

- తెల్లరేషన్ కార్డు ఉన్న వారి వివరాల సేకరణ
- స్పాట్ బిల్లింగ్ మెషీన్లలో నమోదు



వివరాలు ఇచ్చేందుకు క్యూలో నిలబడిన వినియోగదారులు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): గృహజ్యోతి వివరాల అప్‌డేట్ నిరంతర ప్రక్రియ అని విద్యుత్‌శాఖ అధికారులు తెలిపారు. 'ఆంధ్రజ్యోతి'లో మంగళవారం వచ్చిన 'వస్తారా.. వెళ్లాలా..?' గృహజ్యోతి వివరాల సేకరణపై అస్పష్టత అనే కథనానికి వివిధ ప్రాంతా ల్లో దరఖాస్తుదారుల వివరాలు సేకరిస్తున్న విద్యుత్ అధికారులు స్పందించారు. ప్రజాపాలనలో గృహజ్యోతికి దరఖాస్తు చేసుకున్న వారి వివరాలు స్పాట్‌బిల్లింగ్ మెషిన్ల (ఎస్‌పీఎం)లో అప్‌డేట్ చేయడంతోపాటు తెల్లరేషన్‌కార్డు ఉండి ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకోలేని వారి వివరాలు కూడా నమోదు చేసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. కా లనీలు, బస్తీల్లో విద్యుత్‌సిబ్బంది, అధికారులు ఇళ్లకు వెళ్లినప్పుడు కొంతమంది గృహాల్లో ఉండడం లేదని అలాంటి వారికోసం సమీపంలో ప్రత్యేక కౌంటర్లు, హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేసి విద్యుత్ సిబ్బంది ట్యాబ్‌లు, ఫోన్లలో గృహజ్యోతి వివరాలు అప్‌డేట్ చేస్తునట్లు తెలిపారు. సర్వర్ సమస్య తలెత్తిన ప్రాంతాల్లో విద్యుత్ సిబ్బంది కనెక్షన్‌దారుడి నుంచి వివరాలు సేకరించి ఆ తర్వాత ఎస్‌పీఎంలో అప్‌డేట్ చేస్తున్నట్లు తెలిపారు. అద్దె ఇళ్లల్లో నివాసముండే వారికి తెల్లరేషన్ కార్డు ఉంటే మీటర్ ఎవరిపేరు మీద ఉన్నా వారి వివరాలు కూడా స్పాట్ బిల్లింగ్ మెషిన్లలో అప్‌డేట్ చేస్తునట్లు అధికారులు చెబుతున్నారు.

గృహజ్యోతి అప్‌డేట్‌కు.. సర్వర్ డౌన్!

గృహజ్యోతి వివరాల నమోదులో సర్వర్‌డౌన్ సమస్యలు తలెత్తుతున్నాయి. రామంతాపూర్‌లో ఓ వినియోగదారుడు మంగళవారం గృహజ్యోతి వివరాల నమోదు చేయించుకునేందుకు హెల్ప్‌డెస్క్ వద్దకు వెళ్లాడు. విద్యుత్ సిబ్బంది ఫోన్‌లో వివరాలు అప్‌లోడ్ చేయకుండా ఓ పేపర్‌లో వివరాలు నమోదుచేసుకున్నారు. కారణం అడిగితే సర్వర్ డౌన్ అని చెప్పడంతో వినియోగదారుడు ఆగ్రహం వ్యక్తంచేశాడు. ఇక్కడే వివరాలు ఫోన్‌లో చూస్తే స్పష్టత వస్తుందని, ఏమైనా తప్పులున్నా వెంటనే సవరించుకునే అవకాశముంటుందని అన్నారు. పేపర్‌లో రాసిన వివరాలు పోతే మళ్లీ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిందేనని పలువురు వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేశారు.



వాహనదారులకు జరిమానా విధిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

నో పార్కింగ్‌లో నిలిపిన వాహనాలకు జరిమానా

రెజిమెంటల్‌బజార్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): హోటల్ ఎదుట వినియోదారులు వాహనాలు నిలుపుతుండటం వలన ట్రాఫిక్ సమస్య తలెత్తుతుండటంతో గోపాలపురం ట్రాఫిక్ పోలీసులు చలాన్లు విధించారు. మంగళవారం సికింద్రాబాద్‌లోని బ్లూ సీ హోటల్ ఎదుట పార్క్ చేసిన వాహనాలకు చలాన్లు విధించారు. అప్రమత్తమైన కొంతమంది వాహనాలను తీసుకొని వెళ్లగా మిగిలిన వాహనాలకు చలాన్లు విధించారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు పార్కింగ్ చేస్తే చర్యలు తీసుకుంటామని గోపాలపురం ట్రాఫిక్ ఎస్సై హెచ్చరించారు. హోటల్ యాజమాన్యం కూడా పార్కింగ్ సదుపాయం కల్పించి ట్రాఫిక్ సమస్య లేకుండా పోలీసులకు సహకరించాలని తెలిపారు.

16న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి

బౌద్ధనగర్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 16న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ సికింద్రాబాద్ జోన్ కార్యదర్శి టి.మహేందర్ అన్నారు. మంగళవారం వారాసిగూడ చౌరస్తాలో సీఐటీయూ నాయకులు సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్మికుల హక్కుల సాధన కోసం తలపెట్టిన సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. పట్టణ ఉపాధి హామీ కల్పించి సంవత్సరానికి రెండు వందల రోజులు పని కల్పించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణ, వెంకటేష్, శ్రీశైలం, పోచయ్య, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.



నల్గొండ సభకు ఎమ్మెల్యే లాస్య నందితతో కలిసి వెళ్లిన గులాబీ శ్రేణులు

నల్గొండ సభకు తరలిన బీఆర్‌ఎస్ శ్రేణులు

సికింద్రాబాద్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ పతాకాలతో, పార్టీ శ్రేణుల నినాదాలతో మంగళవారం లష్కర్ కళకళలాడింది. నల్గొండ సభకు తరలి వెళ్లేందుకు తెల్లవారుజాము నుంచే గులాబీ శ్రేణులు సన్నద్ధమయ్యారు. సికింద్రాబాద్, సనత్‌నగర్, కంటోన్మెంట్ నియోజకవర్గాల నుంచి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు నల్గొండకు తరలివెళ్లారు. సికింద్రాబాద్ శాసనసభ్యుడు టి.పద్మారావు గౌడ్, సనత్‌నగర్ శాసనసభ్యుడు తలసాని శ్రీనివాస్‌యాదవ్, కంటోన్మెంట్ శాసన సభ్యురాలు లాస్య నందితల నేతృత్వంలో 'జై బీఆర్‌ఎస్' 'జై కేసీఆర్' అంటూ నినాదాలు చేస్తూ మోటర్ కార్లు, జీపులు, బస్సుల్లో పయనమయ్యారు. ప్రధాన రహదారులు, అంతర్గత రోడ్లపై గులాబీ జెండాలు రెపరెపలాడాయి.



బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలతో కార్పొరేటర్ సామల హేమ

విశ్వవిద్యాలయాలకు పెద్దపీట వేయాలి

- ఓయూ జేఏసీ, బహుజన విద్యార్థి సంఘాల నాయకులు

తార్నాక, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం విశ్వవిద్యాలయాలకు పెద్దపీట వేయాలని ఓయూ జేఏసీ, బహుజన విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో విద్యార్థి నాయకులు మాట్లాడారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీని గద్దెదింపి, కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడంలో నిరుద్యోగ విద్యార్థులు కీలకపాత్ర పోషించారని అన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం పది సంవత్సరాలుగా రాష్ట్రంలో విద్యా వ్యవస్థలను పూర్తిగా భ్రష్టుపట్టించిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం విశ్వవిద్యాలయాలకు ప్రత్యేకంగా నిధులు కేటాయించి తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని వారు సూచించారు. కార్యక్రమంలో బీఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వేల్పుల సంజయ్, ఓయూ జేఏసీ చైర్మన్ కొత్తపల్లి తిరుపతి, సోమల అంబేడ్కర్, చందు, అనంద్, సత్యం తదితరులు పాల్గొన్నారు.




పుస్తకాలను ఆవిష్కరిస్తున్న అతిథులు

తెలుగు భాషా పరిరక్షణకు చిట్టెన్‌రాజు కృషి

చిక్కడపల్లి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): తెలుగుభాషా పరిరక్షణకు చిట్టెన్‌రాజు విశేషకృషి చేస్తున్నారని వేంకటేశ్వరయూనివర్సిటీ మాజీ వీసీ ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. ప్రపంచవ్యాప్తంగా తొమ్మిది దేశాలలో ప్రపంచ తెలుగు మహాసభలు స్వయంగా నిర్వహించడం ప్రభుత్వాలు కూడా చేయలేని పని అని, అమెరికాలో ఉండి భాషా సంస్కృతి పట్ల ఆయన అభిమానం చాటుకుంటున్నారన్నారు. వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా త్రిదశాబ్ది వేడుకల సందర్భంగా మంగళవారం రాత్రి త్యాగరాయగానసభలో నాలుగు గ్రంథాల ఆవిష్కరణ సభ జరిగింది. ఆచార్య ఇనాక్ మాట్లాడుతూ.. రచయిత లేకుంటే ఏ కళాప్రక్రియ లేదన్నారు. నటుడు తనికెళ్ల భరణి శ్రీదేవి మురళీధర్ రచించిన స్వయంసిద్ధ నవలను ఆవిష్కరించి మాట్లాడారు. నటి రేఖ జీవితచరిత్ర స్వయంసిద్ధ అని, అది అత్యుత్తమ జీవితచరిత్ర అన్నారు. వంగూరి చిట్టెన్‌రాజు రచించిన అమెరికా కాకరకాయ కథలు సినీ గీత రచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు, డయాస్పొరా తెలుగు కథల సంకలనంను సాహితీవేత్త డా.ఓలేటి పార్వతీశం, అర్ధ శతాబ్దిలో అమెరికా తెలుగు కథలు సంపుటిని అవధాని కడిమెళ్ల వరప్రసాద్ ఆవిష్కరించారు. రాధిక మంగిపూడి, వంశీరామరాజు తదితరులు పాల్గొన్నారు.

ఏసీబీకి చిక్కిన దూద్‌బౌలి ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్



ఏసీబీకి చిక్కిన అమిర్ ఫరాజ్

మదీన, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): సేల్ డీడ్ ఆస్తులను రిజిస్ట్రేషన్ చేయడానికి ఓ వ్యక్తి నుంచి రూ.2 లక్షలు లంచం తీసుకుంటూ దూద్‌బౌలి ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. పాతనగరం దూద్‌బౌలి సబ్‌రిజిస్ట్రార్ ఆరు నెలల క్రితం బదిలీకావడంతో ఆయన స్థానంలో అదే కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా ఉన్న అమిర్ ఫరాజ్ ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. షాలిబండకు చెందిన సయ్యద్ షహబాజ్, అతని స్నేహితుడు పర్వేజ్‌కు చెందిన రెండు సేల్‌డీడ్ పత్రాలను ఒకటి తన పేరు మీద, మరొకటి స్నేహితునితో కలిసి జాయింట్ రిజిస్ట్రేషన్ చేయమని కోరాడు. దీనికి అమిర్ ఫరాజ్ రూ. 2 లక్షలు లంచం అడిగాడు. దీనికి అంగీకరించిన సయ్యద్ షహబాజ్ రిజిస్ట్రార్ సూచన మేరకు కార్యాలయంలో హెల్పర్‌గా పనిచేసే గోపీసింగ్‌కు నగదు అందించాడు. అప్పటికే మాటువేసిన ఏసీబీ అధికారులు గోపీసింగ్‌ను, ప్రధాన నిందితుడైన ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆమెర్ ఫరాజ్‌లను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.